క్లుప్తంగా

రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుపై ఉన్న రాళ్లను తొలగిస్తున్న జేసీబీ

బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ నుంచి కనమనంబేడు గ్రామానికి వెళ్లే రోడ్డుపై ఉన్న రాళ్లను సర్పంచ్ వెంకటమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా తొలగించి మరమ్మతులు చేయించారు. మెయిన్‌రోడ్డు పక్కనే కనమనంబేడు రోడ్డుపై పెద్ద రాళ్లు ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడేవారు. దీంతో స్పందించి జేసీబీ యంత్రంతో రాళ్లను తొలగించి, గ్రావెల్ మట్టిని తోలి, శుభ్రం చేయించారు. దీంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరుని సేవలో తిరుపతి కమిషనర్



ఆలయ ధ్వజస్తంభం వద్ద కుటుంబ సభ్యులతో కమిషనర్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలకమండలి సభ్యుడు బుల్లెట్ జయశ్యామ్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ప్రత్యేక రాహుకేతు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణా మూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం

కార్వేటినగరం: కార్వేటినగరం ప్రసిద్ధి చెందిన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో చిత్తూరుకు చెందిన దాతలు తేజ, భవ్య కుటుంబ సభ్యులు శుక్రవారం ఆలయంలో వందమందికి అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ స్వామివారి దర్శనం కోసం ఇతర మండలాల నుంచి వచ్చి పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఇలా ప్రతి భక్తుడు ముందుకువచ్చి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో తేజ, భవ్య కుటుంబ సభ్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు



తాగునీటి బోరు డ్రిల్ చేస్తున్న లారీ

ఏర్పేడు: మండలంలోని చెల్లూరులో శుక్రవారం తాగునీటి బోరు తవ్వకం ప్రారంభించారు. తాగునీటి సమస్య ఉండడంతో ఇటీవల వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులతో కలిసి ఆ పార్టీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్ రెడ్డి ద్వారా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి విన్నవించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు గ్రామంలో తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. తాగునీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జీపీ యాదవ్, వేణు యాదవ్, హరి గౌడ్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

కార్గో మాసోత్సవాలపై ర్యాలీ

శ్రీకాళహస్తి: ఆర్టీసీ నిర్వహిస్తున్న కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలపై శుక్రవారం అధికారులు, సిబ్బంది పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. డిపో మేనేజరు రాజవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కార్గో సర్వీసు ద్వారా 50 కిలోల వస్తువులు డోర్ డెలివరీ ద్వారా ఇంటి వద్దకు చేరుస్తామన్నారు. పది కిలోమీటర్ల పరిధిలో డోర్ డెలివరీ అందిస్తామని పేర్కొన్నారు. పార్శిల్ బుక్ చేసుకోవడానికి క్యాష్‌లెస్ డిజిటల్ విధానం అందుబాటులో ఉందని చెప్పారు. ఇక ట్రాకింగ్ సిస్టం ద్వారా తమ పార్శిల్ ఎక్కడా ఉందో అని తెలుసుకోవచ్చని తెలిపారు. కార్గో ఏజెంట్‌గా చేరేందుకు ఆసక్తి కలిగిన వారు పురపాలక సంఘ పరిధిలో రూ.వెయ్యి సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించి చేరాలన్నారు. బుకింగ్ చేసిన మొత్తంపై 15శాతం, పార్శిల్ మొత్తంపై 2శాతం కమిషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు

- పుట్టలో పాలు పోసేందుకు తరలివచ్చిన భక్తులు
- గ్రామాల్లో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత



శ్రీకాళహస్తి: నాగులచవితి పూజల్లో ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

సత్యవేడు: నాగుల చవితి పర్వదినాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శుక్రవారం ఉదయం నాగాలమ్మ ఆలయాలు, గ్రామ శివార్లలోని పుట్టల వద్దకు కుటుంబ సమేతంగా వెళ్లి పసుపు, కుంకుమ, పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. చిమ్మిలి, చలివిడి, బురగుంజు, గుడ్లు, పాలు పుట్టలో పోసి నాగాలమ్మకు నైవేద్యం సమర్పించారు. సంతానం, సౌభాగ్య ప్రదాత నాగాలమ్మ అమ్మవారిని భక్తి శ్రద్ధలతో కొలిచారు. సత్యవేడు బాలనాగాలమ్మ పుట్ట వద్ద, ఇరుగుళం, మదనంబేడు, దాసుకుప్పం, ప్రాంతాల్లో పుట్టపూజ చేసేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

పిచ్చాటూరులో..

పిచ్చాటూరు: మండలంలో నాగుల చవితి వేడుకలను శుక్రవారం ప్రజలు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. పిచ్చాటూరు టీచర్స్ కాలనీలో ఉన్న నాగాలమ్మ ఆలయంలో మహిళలు స్వయంభు నాగమ్మకు పాలు, కోడిగుడ్లను నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. స్థానిక వీరబ్రహ్మంగారి ఆలయం వద్ద, గ్రామాల్లో పుట్టల వద్ద భక్తులు నాగుల చవితి పూజలు చేశారు. .

నాగేంద్రునికి పూజలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలవ్యాప్తంగా నాగుల చవితి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు భక్తి శ్రద్ధలతో నాగేంద్రునికి పూజలు చేశారు. పుట్టలో పాలు పోసి, కోడిగుడ్లను వేసి, పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉపవాసం ఉండి నాగాలమ్మకు మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

నాగలాపురంలో

నాగలాపురం: నాగలాపురం బ్రాహ్మణ వీధిలో నాగులచవితి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి వచ్చి నైవేద్యాలు సమర్పించి పుట్టలో పాలు పోసి, కోడి గుడ్లు సమర్పించారు. జాతక దోష నివారణ, పెళ్లి కానివారు, సంతానం లేని వారి కోసం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు.

పరాశురేశ్వరస్వామి ఆలయంలో..

నారాయణవనం: మండలంలో మహిళలు నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దీపావళికి నాలుగో రోజున పండుగను జరుపుకుంటారు. పాముల పుట్టలకు పసుపు కుంకుమలతో పూజించి నైవేద్యాలను సమర్పించారు. పాలు, పండ్లను పుట్టలలో వేశారు. ఉదయం నుంచి మహిళలు స్థానిక పరాశురేశ్వరస్వామి ఆలయంలో, అవనాక్షమ్మ ఆలయంలో, తుంబూరు శివాలయంలో, ఎల్లమ్మ దేవస్థానంలో, కీళగరం చెరువుకట్టపై కలగూరమ్మ ఆలయాలలోని పుట్టలకు పూజలు నిర్వహించారు. చవితి ఉత్సవాన్ని పురస్కరించుకుని నిర్వాహకులు ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: మండలవ్యాప్తంగా నాగులచవితి వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం ఉదయం నుంచే అన్ని గ్రామాల్లో నాగల పుట్ట వద్ద భక్తుల సందడి నెలకొంది. పుట్టల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరదయ్యపాళెం కదూరు, సంతవేలూరు, బత్తలవల్లం, కారిపాకం, తొండంబట్టు అనంతరం ఉపవాసాలతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామివారి రుద్రపాదాల చెంత ఉన్న నాగాలయంలోని నాగశిలలకు శుక్రవారం నాగుల చవితిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా నాగశిలలకు పాలు, పెరుగు, తేనె, పంచామృతం, చందనం పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సుగంధ పరిమళ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఈ పూజల్లో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు సునీత, రమాప్రభ, చెంచులత, ఆలయ అధికారులు సుదర్శన్‌నాయుడు పాల్గొన్నారు. పట్టణవ్యాప్తంగా నాగశిలల, పుట్టల వద్ద మహిళలు పెద్దసంఖ్యలో పూజలు చేశారు.



సత్యవేడు: బాలనాగాలమ్మ ఆలయం వద్ద పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



మదనంబేడులో పుట్టకు పూజ చేస్తున్న భక్తులు



పిచ్చాటూరులో పూజలు చేస్తున్న భక్తులు

పుట్టకు పూజలు

ఏర్పేడు: మండలంలోని గ్రామాలన్నింటిలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నాగులచవితి ఘనంగా నిర్వహించారు. ఏర్పేడు, మర్రిమంద, అంజిమేడు, పాపానాయుడుపేట, కందాడు, పల్లం, మేర్లపాక తదితర గ్రామాల్లో మహిళలు ఆయా గ్రామాల్లోని నాగులపుట్ట వద్ద పూజలు చేశారు. అనంతరం పుట్టలలో పాలు, కోడిగుడ్లు వేసి మొక్కులు చెల్లించుకున్నారు.






బుచ్చినాయుడుకండ్రిగలో..., నాగలాపురంలో పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు, కీళగరం చెరువుకట్టపై పుట్టకు పూజలు చేస్తున్న మహిళలు, తొండంబట్టులో నాగాలమ్మ పుట్ట వద్ద పూజలు చేస్తున్న స్థానికులు

వైభవంగా స్కంధ షష్టి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రమణ్యస్వామి

నగరి: పట్టణ పరిధిలోని కరకంతేశ్వర స్వామి ఆలయంలో స్కంధ షష్టి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సుబ్రమణ్యంస్వామికి వీరభద్రుడి అలంకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసి పుష్పాలంకరణ, ఆలయ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు దుర్గాప్రసాద్ సుబ్రమణ్య స్వామికి వీరభద్రుడి అలంకరణ చేపట్టి భక్తుల దర్శనార్థం ఆలయ మండపం వద్ద ఉంచారు. ఈ అలంకరణ భక్తులను అమితంగా ఆకట్టుకుంది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి హారతి పూజలు, ఊంజల్ సేవ నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఉభయదారులకు ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడ వల్లీదేవసేనా సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో కూడా స్కంధ షష్టి వేడుకలను వైభవంగా నిర్వహించారు.

సైన్స్‌సెంటర్‌లో విజ్ఞాన వీచికలు

తిరుపతి కల్చరల్: బాలల దినోత్సవం సందర్భంగా తిరుపతి బాలోత్సవం వారి సహకారంతో బాలల సైన్స్ ఫెస్టివల్‌లో సైన్స్ విజ్ఞానం వెల్లివిరిసింది. రెండు రోజులపాటు సైన్స్ సెంటర్‌లో విద్యార్థులతో సైన్స్ ఎగ్జిబిషన్స్, సైన్స్ ఇతివృత్తంగా నాటక ప్రదర్శనలతో శుక్రవారం బాలల ఫెస్టివల్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి టీటీడీ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టి.దేవేంద్రబాబు హాజరయ్యారు. విద్యార్థులు సుమారు 50కిపైగా సైన్స్ టెక్నాలజీ, ఇంజినీరింగ్ అండ్ మ్యాథమేటిక్స్ వంటి అంశాలపై ప్రదర్శించిన నమూనాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. శనివారం కూడా సైన్స్ సెంటర్‌లో ఈ బాలల సైన్స్ ఫెస్టివల్ కొనసాగుతుందని ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ తెలిపారు. తిరుపతి బాలోత్సవం గౌరవాధ్యక్షుడు టెంకాయల దామోదరం, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నాగలాపురం: మండలంలోని వేంబాక్కం హరిజనవాడలో మురుగునీటి కాలువ లేకపోవడంతో కాలనీ వాసులు చాలా ఇబ్బంది పడేవారు. ఇళ్లలో నీరు వీధుల్లోకి నిల్వ చేరి దోమలు దాడి చేస్తున్నాయని స్థానికులు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన గడపగడపకు మన ప్రభుత్వం నిధుల ద్వారా డ్రైనేజీ కాలువ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు శ్యామ్, మహేష్ రెడ్డి, ఎంపీటీసీ రాజ, కులశేఖర్ రెడ్డి తదితరులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తూ సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం మేరకు, తిరుపతికి చెందిన ప్రతాప్(19), దినేష్(34) ద్విచక్ర వాహనంపై వెంకటగిరికి వెళుతుండగా అంజిమేడు వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్సా రాష్ట్ర అధ్యక్షుడిగా సుబ్రమణ్యంరాజు

తిరుపతి ఎడ్యుకేషన్: ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్(అప్సా) రాష్ట్ర అధ్యక్షుడిగా ఆ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు వి.సుబ్రమణ్యంరాజు ఎన్నికయ్యారు. ఈ నెల 16వ తేదీ విజయవాడలో జరిగిన అప్సా రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నికల్లో ఆయన రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సుబ్రమణ్యంరాజు ఎన్నికపై ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు హర్షం వ్యక్తం చేశారు.

అలరించిన కవి సమ్మేళనం

తిరుపతి అర్బన్: 56వ గ్రంథాలయ జాతీయ వారోత్సవాలను పురస్కరించుకొని గోవిందరాజస్వామి దక్షిణ మాడవీధిలోని ప్రాంతీయ ప్రభుత్వ గ్రంథాలయంలో శుక్రవారం ఉదయం కవి సమ్మేళనం చేపట్టారు. భారత స్వతంత్ర పోరాటం ప్రధాన అంశంగా సాగిన ఈ కవి సమ్మేళనానికి సభాధ్యక్షులుగా డాక్టర్ నేమిలేటి కిట్టన్న వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల దమన నీతి మొదలుకొని మొదటి సైనిక తిరుగుబాటు నుంచి మహాత్మా గాంధీ సారథ్యంలో అహింసా మార్గంలో భారతీయులు ఉద్యమ బాటలో స్వతంత్రాన్ని సాధించిన విధివిధానాలను ప్రస్తావించారు. ప్రముఖులను చివరిగా సన్మానించారు. డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్, డాక్టర్ కలువగుంట రామమూర్తి, ప్రముఖ కథా రచయిత, కవి పేరూరు బాలసుబ్రమణ్యం, రచయిత సురేంద్ర రొద్ద, గ్రంథాలయాధికారి సత్యనారాయణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్నకు చెబుదాం'



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డి

నారాయణవనం: సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తోందని శ్రీకాళహస్తి ఆర్డీఓ రవిశంకర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రం నారాయణవనంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. సొరకాయల స్వామి కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజల నుంచి 63 అర్జీలను స్వీకరించి, స్పందన పోర్టల్‌లో నమోదు చేసి రశీదులను అందజేశారు. వీటన్నింటినీ పరిశీలించి పరిష్కరించాలని ఆర్డీఓ ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు సచివాలయాల్లో నిర్వహించే స్పందన కార్యక్రమంలో స్థానిక, వ్యక్తిగత సమస్యలపై సంబంధిత అధికారులు సకాలంలో స్పందించాలన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికుల సమస్యలను పరిశీలించిన అధికారులు జగనన్నకు చెబుదాం స్పందన పోర్టల్‌లో నమోదు చేయించారు. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. మరికొన్నింటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ ఆదిశేషా రెడ్డి, ఎంపీడీఓ కృష్ణమూర్తి, తహసీల్దార్ ప్రమీల, మండల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ గుణశేఖర్, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సొరకాయలు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వీఆర్వోలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉమ్మడి ఖాతా తెరవండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహారావు

బుచ్చినాయుడుకండ్రిగ: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యాదీవెన పథకానికి కచ్చితంగా సంబంధిత విద్యార్థులు, తల్లి పేరుతో బ్యాంకులో ఉమ్మడి ఖాతా తెరవాలని ఎంపీడీఓ నరసింహారావు తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సచివాలయ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 24వ తేదీలోపు బ్యాంకుల్లో విద్యార్థులు, తల్లి ఉమ్మడి ఖాతా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులను ఇబ్బంది పెట్టకుండా బ్యాంకర్లు సహకరించాలని తెలిపారు. విద్యార్థి, తల్లి పేరుతో బ్యాంకు ఉమ్మడి ఖాతా ఉంటేనే జగనన్న విద్యాదీవెన నాలుగో విడత లబ్ధి జమ అవుతుందని చెప్పారు. ఎస్సీ విద్యార్థులకు, 2022–23 విద్యా సంవత్సరంలో డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు ఖాతా తెరవాల్సిన అవసరం లేదన్నారు. బీసీ, ఈబీసీ, మైనారిటీ, కాపు, ఎస్టీ విద్యార్థులు ఉమ్మడి ఖాతాలను కచ్చితంగా తెరవాలని తెలిపారు. ఈ ప్రక్రియను కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాజశేఖర్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిని నిర్మూలిద్దాం




కుక్కలగుంటలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నాగరాజు

ఏర్పేడు: కుష్టు వ్యాధిని నిర్మూలిద్దామని పాపానాయుడుపేట పీహెచ్‌సీ డాక్టర్ నాగరాజు అన్నారు. మండలంలోని కుక్కలగుంటలో శుక్రవారం జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. గ్రామంలో వైద్య సిబ్బంది ర్యాలీ చేసి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రథమ దశలో వ్యాధిని గుర్తిస్తే కొంతమేరకు నివారించవచ్చన్నారు. ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందన్నారు.

కుక్కలగుంటలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

మండలంలోని కుక్కలగుంటలో పాపానాయుడుపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ సేవలు నిర్వహించారు. గ్రామంలోని 60 మంది రోగులకు రక్తం, బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్ సూపర్ వైజర్ మంజుల, ఎంఎల్‌హెచ్‌పీ కుసుమకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి పాల్గొన్నారు.

కార్తికమాస ఆరంభ పూజలు

నగరి: పట్టణ పరిధిలోని కరకంతేశ్వర స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి సన్నిధిలో తమిళ కార్తిక మాస ఆరంభ పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు భక్తులు అయ్యప్ప మాలధారణ చేశారు. శనివారం శబరియాత్రకు వెళ్లే భక్తులు ఆలయంలోని అయ్యప్ప, వినాయక, సుబ్రమణ్య స్వామి విగ్రహాలను, పద్దెనిమిది మెట్లను సుందరంగా అలంకరించగా అందరినీ ఆకట్టుకుంది. అయ్యప్ప పాటలతో ఆలయ ఆవరణలు మార్మోగాయి. అయ్యప్ప భక్తులు అందరికీ అన్నదానం చేశారు. కార్యక్రమంలో మణి ఆచారి, మదన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు




శ్రీకాళహస్తి: అంజూరు తారక శ్రీనివాసులును సన్మానిస్తున్న దృశ్యం, నారాయణవనం: వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న బాలికోన్నత పాఠశాల విద్యార్థులు

నారాయణవనం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నారాయణవనంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ జీవన్ మాట్లాడుతూ జిల్లా శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు శాస్త్ర, వైజ్ఞానిక పుస్తకాలతో పాటు దినపత్రికలు, కథల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు విరామ సమయంలో గ్రంథాలయాన్ని సందర్శించాలని సూచించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

గ్రంథాలయాలు జ్ఞాన నిలయాలు

శ్రీకాళహస్తి: గ్రంథాలయాలు జ్ఞాననిలయాలు అని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పట్టణాల్లోని గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. దీనికి అంజూరు తారక శ్రీనివాసులు ముఖఅతిథిగా హాజరయ్యారు. స్థానిక కవులు మునిసుబ్బారెడ్డి, ఆనందయ్య, గురునాథం పుస్తకాల ఆవశ్యకత, పుస్తకాల చదవాల్సిన అవసరం కవితల రూపంలో తెలిపారు. వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ పుస్తకాల ద్వారా భవిష్యత్తు, వర్తమానాలు తెలుసుకోవచ్చన్నారు. గ్రంథాలయ అధికారి లావణ్య మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకుని విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు గ్రంథాలయ అధికారి హరికృష్ణ, విశ్రాంత గ్రంథాలయ అధికారి చెంచురెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వరూపానందేంద్రస్వామికి జన్మదిన శుభాకాంక్షలు



విశాఖ శారదా పీఠాధిపతికి పండ్లు, వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: విశాఖ శారదాపీఠం స్వరూపానందేంద్రస్వామి వారి పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి శుక్రవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విశాఖపట్నంలోని ఆశ్రమానికి చేరుకుని పండ్లు, దుస్తులు అందజేశారు. ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.